తగ్గుతున్న చెరువుల విస్తీర్ణం

- ఉపాధి హామీ పనులపై పర్యవేక్షణ కరువు
- అడ్డదిడ్డంగా మట్టిని పోస్తున్న వేతనదారులు



చెరువు గర్భంలోకి వేసిన మట్టి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): చెరువుల విస్తీర్ణాలు ఏడాదికేడాదికీ తగ్గిపోతున్నాయి. ఒకవైపు చెరువు భూగర్భాలను రైతులు కొంత ఆక్రమించగా.. మరో వైపు ఉపాధి హామీ పనుల నిర్వహణలో లోపం కారణంగా చెరువులు ఉనికి కోల్పోతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ పనులు సక్రమంగా చేపట్టకపోవడం వల్ల చెరువుల విస్తీర్ణాలు కుచించుకుపోతున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఉపాధి పనులను అధికారుల పర్యవేక్షించకపోవడంతో వేతనదారులు చెరువుల్లో తవ్విన మట్టిని మళ్లీ చెరువు గర్భంలోనే వేస్తుండడంతో చెరువుల విస్తీర్ణాలు తగ్గిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. చెరువులను లోతుగా చేసి నీటి నిల్వ సామర్థ్యం పెంచాలనే ఉద్దేశంతో అధికారులు చెరువుల్లో ఉపాధి పనులు చేపడుతున్నారు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. నియోజక వర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లోని అన్ని పంచాయతీల్లో కూడా ఉపాధి పనులు చేపడుతున్నారు. ఈ పనులు జరిగే సమయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గరుండి సలహాలు అందిస్తూ పనులను చేయించాలి. చెరువుల్లో తవ్విన మట్టిని చెరువు గట్టుకు దట్టంగా వేస్తూ నడవడానికి వీలుగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలి. అయితే ఫీల్డ్ అసిస్టెంట్లు తమ బాధ్యతలను మేట్‌లకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఉపాధి పనుల వల్ల చెరువుల లోతు పెరగాల్సింది పోయి విస్తీర్ణం తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించకపోవడం.. పనులు జరిగే విధానాన్ని పర్యవేక్షించకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని అన్నదాతలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుల్లో ఉపాధి పనులు పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా


రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి గుడికి వెళ్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గల రాజరాజేశ్వరిదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ప్రభలు, ఘటాలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకుడు దూసి శ్రీధర్‌శర్మ భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పంపిణీకి సిద్ధమైన మొక్కలు



నర్సరీలో పెంచిన మొక్కలు

బొండపల్లి: మండల కేంద్రంలోని వనమిత్ర నర్సరీలో వివిధ రకాల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వనమిత్ర నర్సరీలో ఈ ఏడాది లక్షా 25 వేల మొక్కలు పెంచారు. కాగు, వేప, బాదం, తదితర మొక్కలను గతేడాది నుంచి పెంచుతున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి వర్షాలు ప్రారంభమైన తర్వాత 50 వేల మొక్కలను రైతులకు.. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపులా నాటేందుకు మరో 25 వేల మొక్కలను సిద్ధం చేశారు. మొక్కలు కావాల్సిన రైతులు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని నర్సరీ నిర్వాహకులు చెబుతున్నారు.

కోటమ్మను దర్శించుకున్న బూడి



కొట్టాం ఆలయం వద్ద ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రుల ఇలవేలుపు కొట్టాం గ్రామంలోని కోటమ్మ అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీసమేతంగా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఉపాధ్యాయ సంఘ నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

యోగాతో రాజయోగం..



యోగా ఆవశ్యకతను వివరిస్తున్న డాక్టర్ త్రినాథరావు

శృంగవరపుకోట: యోగా సాధనతో రాజయోగం సాధ్యమవుతుందని మోక్షవిద్య యోగామందిర్ నిర్వాహకుడు కోటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్రలో భాగంగా స్థానిక శ్రీసాయి కృష్ణ ఆస్పత్రిలో యోగాపై ఆదివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ త్రినాథరావు యోగా ఆవశ్యకతను వివరించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్ ఎస్.కోటేశ్వరరావు, పలువురు యోగా సాధకులు హాజరయ్యారు.

గిరిజన సమస్యలపై వినతి



విశాఖ ఎంపీ భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సన్యాసినాయుడు, తదితరులు

శృంగవరపుకోట: ఎస్.కోట మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న రేగ పుణ్యగిరి గ్రామస్తులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు ఎంపీ శ్రీభరత్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భవన శంకుస్థాపన కార్యాక్రమానికి హాజరైన ఎంపీ భరత్‌ను పలువురు గిరిజనులు కలిశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు సన్యాసినాయుడు మాట్లాడుతూ.. రూ.4 కోట్లతో మంజూరైన రోడ్డు నిర్మాణం ఇంతవరకూ జరగలేదన్నారు. డోలీమోతల నుంచి గిరిజనుల్ని కాపాడాలని.. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి పోడు పట్టాలు ఇప్పించాలని.. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని కోరారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



వేపాడ మండలంలోని వీలుపర్తి పంచాయతీలో పట్టపగలు విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్‌ను ఆదా చేయాలని చెబుతున్న అధికారులకు వెలుగుతున్న బల్బులు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- వేపాడ

గుంతల రోడ్డు..



మండలంలో ఎటువైపు చూసినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. రహదారులపై రాకపోకలు సాగించాలంటనే వాహన చోదకులు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి చీపురుపల్లి నుంచి గరివిడి మండలంలోని మందిరవలసకు వెళ్లే బీటీ రోడ్డు చక్కని ఉదాహరణగా నిలుస్తోంది. చీపురుపల్లి మేజర్ పంచాయతీలోని జి.అగ్రహారం నుంచి గరివిడి మండలంలోని మందిరవలసతో పాటు మెరకముడిదాం మండలంలోని యాడిక, గరుగుబిల్లి, ఐతంవలస, తదితర గ్రామాలకు వెళ్లే ఈ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

- చీపురుపల్లి

వ్యవసాయ పనుల్లో అన్నదాత..



తలారి సమీపంలో దుక్కు చేస్తున్న రైతు

లక్కవరపుకోట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి నారుమడుల తయారీలో రైతన్నలు బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే పొలాల్లో ఎరువులు చల్లి రెండు,మూడు పర్యాయాలు దుక్కులు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సాగుకు అనుకూలమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా నేటికీ మండల కేంద్రాలకు వరి విత్తనాలు చేరకపోవడంతో రైతులు ఓ పక్క ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి సహకరించినా ప్రభుత్వం సహకరించడం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో ఈ సమయానికి రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం నగదు జమచేసింది. అలాగే విత్తనాలు కూడా అందుబాటులో ఉంచింది. కాని కూటమి ప్రభుత్వ హయాంలో రైతులకు ఒరిగిందేమీ లేదని పలువురు చెబుతున్నారు.

అభినందనలు..



ఇటీవల జరిగిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గోకేడ యశ్వంత్‌ను బానాది ఎంపీటీసీ సభ్యులు గొంప తులసి, వెంకటరావు దంపతులు ఆదివారం అభినందించారు. ఎల్.కోట మండలం పోతంపేటకు చెందిన యశ్వంత్ పరీక్షలో జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించడంతో పాటు రాష్ట్రంలో 23వ ర్యాంక్, ఆల్ ఇండియాలో 363 ర్యాంక్ సాధించడం అభినందనీయమని కొనియాడారు.

- వేపాడ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

గజపతినగరం: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్‌లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992 నుంచి 2002 వరకు పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని.. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు. సేవా కార్యక్రమాలు చేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు.

మురుగునీటితో అవస్థలు



గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

- ఈగలు, దోమలతో అల్లాడుతున్న కాలనీ వాసులు

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి గేదెలవానిపాలెం మీదుగా అలమండ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో మురుగునీరు నిత్యం ప్రవహిస్తోంది. ఈ కాలనీలో రోడ్లు, కాలువలు లేకపోవడంతో వాడుకనీరు, వర్షపు నీరు ఆర్అండ్‌బీ రోడ్డు మీదుగానే ప్రవహిస్తుంటాయి. దీంతో సుమారు రూ. 32 లక్షలతో నిర్మించిన తారు రోడ్డు పూర్తిగా గోతులతో అధ్వానంగా తయారైంది. అలాగే మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోవడంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని, దీంతో అంటురోగాలు ప్రబలుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నీరు నిల్వ ఉండిపోవడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయని, దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



వర్షంతో ఉపశమనం

వేపాడలో కురుస్తున్న వర్షం

కొద్ది రోజులుగా ఎండలతో అవస్థలు పడిన ప్రజలు ఆదివారం కురిసిన వర్షానికి సేదదీరారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి వాతావరణం చల్లబడింది. అయితే ఖరీఫ్ సాగుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నా.. ప్రస్తుతం సాగులో ఉన్న నువ్వు పంటకు మాత్రం నష్టం తప్పదంటున్నారు. వేపాడ, దత్తిరాజేరు, గజపతినగరం మండలాల్లో వర్షం కురిసింది.

- వేపాడ/దత్తిరాజేరు/గజపతినగరం



గజపతినగరం రూరల్: గజపతినగరం - మెంటాడ రోడ్డులో వర్షపు నీరు



దత్తిరాజేరు: పెదమానాపురం చిల్లవీధిలో చేరిన వర్షపు నీరు

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి..



అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న అడ్డూరి సీతబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు

గుర్ల: యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి సీతబాబు అన్నారు. మండలంలోని గుజ్జింగివలసలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంబేడ్కర్ అందరివాడని.. విద్యార్థులు , యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అంబేడ్కర్ ఇండియన్ మిషన్ సంస్థ కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కెల్ల భీమారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అట్టాడ రామకృష్ణ , మాజీ సర్పంచ్ గొర్లె రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం



వీలుపర్తిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ: మండలంలోని వీలుపర్తి, పాటూరు గ్రామ పంచాయతీల్లో 97 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను విశాఖ పార్లమెంట్ సభ్యుడు మతుకుపల్లి శ్రీభరత్, నియోజకవర్గ శాసనభ్యురాలు కోళ్ల లలితకుమారి ఆదివారం ప్రారంభించారు. వీలుపర్తి సర్పంచ్ శానాపతి లీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధి నిధులు రూ. 43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం.. రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతుసేవా కేంద్ర భవనం.. ఏడు లక్షల రూపాయలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించి, వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రం అప్పుల్లో ఉన్నందున సంక్షేమ పథకాలు అలస్యమవుతున్నాయన్నారు. గ్రామ పంచాయతీలో ఎనిమిది శివారు గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, టవర్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ లీల కోరారు. అలాగే పాటూరులో ఉపాధి నిధులతో నిర్మించిన రైతుసేవా కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంప కృష్ణ, ఇందకూరు సుధారాణి ఎంపీడీఓ సూర్యనారాయణ, పీఆర్ ఏఈ ఆలీ, ఈఓపీఆర్‌డీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గేదెలవానిపాలెంలో..

లక్కవరపుకోట: మండలంలోని గేదెలవానిపాలెంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, కల్వర్టులతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పైడిరాజు, పంచాయతీరాజ్ జేఈ వీరలక్ష్మి, తెలుగుదేశం పార్టీ నాయకులు కోళ్ల రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన.

శృంగవరపుకోట : మండలంలో బొడ్డవర నుంచి చిట్టంపాడు వరకూ రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు.. ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అదనపు వసతుల భవనానికి విశాఖ ఎంపీ భరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, జీఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పాలు, గుడ్లు పంపిణీ



క్రీడాకారులకు పాలు, గుడ్లు ఇస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట : పట్టణంలోని నారాయణ్ కేంబ్రిడ్జ్ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ షటిల్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు ఆదివారం పాలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ..క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆత్మస్థైర్యం పెరుగుతుందని చెప్పారు. క్రీడా శిబిరం నిర్వహణకు సహకారం అందిస్తున్న స్థానికులు, మిత్రులకు ఎమ్మెల్సీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌సీ అధ్యక్షుడు డాక్టర్ సత్యశేఖర్, మంధా సుబ్బారావు, ఏఎస్ వెంకటరావు, ఎ.మోహన్, రమేష్, కోచ్ పి.శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో దళితులకు రక్షణ కరువు

నెల్లిమర్ల రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో దళితులకు రక్షణ కరువైందని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య విమర్శించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం ఓ ప్రకటనలో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎక్కడపడితే అక్కడే దళితులపై దాడులు జరుగుతున్నాయని, అయినా నిందితులపై ప్రభుత్వ చర్యలు శూన్యమన్నారు. అనకాపల్లి జిల్లా, డొంకాడలో ఓ వివాహ కార్యక్రమానికి లైటింగ్ పనుల నిమిత్తం వచ్చిన ఎనిమిది మంది దళిత యువకులపై దొంగతనం పేరుతో టీడీపీకి చెందిన అగ్రవర్ణాలు వారు దాడికి దిగడం విచారకరమన్నారు. అదే గొడవలో పంచాయతీ పేరుతో గ్రామానికి పిలిచి, రాత్రంతా కర్రలతో కొట్టి చిత్రహింసలకు గురి చేశారన్నారు. ఇదే ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకపోవడమేంటని నిలదీశారు. దళిత హోంమంత్రి అనిత సొంత నియోజకవర్గంలోనే ఇలా దళితులకు అన్యాయం జరుగుతుంటే న్యాయం జరగకపోవడం దారుణమన్నారు.